సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024



టన్ను చీనీ రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు కనిష్టం రూ.12 వేల ప్రకారం ధర పలికాయి.



టమాట కిలో రూ.46

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.46, కనిష్టంగా రూ.24 పలికింది. మార్కెట్‌కు 2,100 టన్నుల టమాట అమ్మకానికి వచ్చింది.

గరిష్టం/కనిష్టం
35.8°/22.6°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఎండుమిర్చి క్వింటా రూ.19 వేలు



మార్కెట్‌లో ఎండుమిర్చి లావాదేవీలు

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం ఎండుమిర్చి క్వింటా రూ.19 వేలు పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి.చంద్రమౌళి తెలిపారు. మార్కెట్‌కు 210 క్వింటాళ్ల మిర్చి రాగా, అందులో మొదటి రకం మిర్చి క్వింటా రూ.19 వేలు, రెండో రకం రూ.9 వేలు, మూడో రకం ఎండుమిర్చి క్వింటా రూ.7 వేలు పలికినట్లు ఆయన వెల్లడించారు.

రేపు బీటెక్ స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 26న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర తెలిపారు. ఏపీ ఈఏపీసెట్ -2024లో బీటెక్ కోర్సులో కన్వీనర్ కోటా సీట్లు భర్తీ అయ్యి మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు ద్వారా భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు గురువారం ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు WWW.SKUCET.AC.IN వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ల బదిలీ



ప్రశాంతి నిలయం: జిల్లాలోని 60 మంది రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్లు బదిలీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం బదిలీలపై నిషేధం ఎత్తివేయడంతో సీసీఎల్ఏ ఉత్తర్వులు మేరకు ఉన్నతాధికారులు డీటీలకు కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీల ప్రక్రియ పూర్తి చేశారు. బదిలీ అయిన వారికి కలెక్టర్ టీఎస్ చేతన్ పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే నూతన స్థానాల్లో చేరాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలోని 159 మంది గ్రేడ్-1 వీఆర్‌ఓలు సైతం బదిలీ అయ్యారు. వీరందరినీ వెంటనే పాత స్థానాల నుంచి రిలీవ్ చేయాలని కలెక్టర్ ఆశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు.

8 మండలాల్లో వర్షం



ప్రశాంతి నిలయం: అల్పపీడనం ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకూ జిల్లాలోని 8 మండలాల్లో వర్షం కురిసింది. సగటున 6.7 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా గోరంట్ల మండలంలో 64.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక బుక్కపట్నం మండలంలో 35.4 మి.మీ, పుట్టపర్తి 24.2, హిందూపురం 22.4, కొత్తచెరువు 21.6, గుడిబండ 21.0, పరిగి 15.6, లేపాక్షి మండలంలో 11.2 మి.మీ మేర వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు.

విద్యార్థి భవితతో ఆటలు



పదో తరగతి.. ప్రతి విద్యార్థి జీవితంలోనూ కీలకమైన ఘట్టం. పదిలో సాధించే మార్కులు భవిష్యత్‌లోనూ వారికి ఉపయోగపడతాయి. అందువల్లే పదో తరగతి విద్యార్థులపై అందరూ ప్రత్యేక దృష్టిసారిస్తారు. పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేస్తారు. ఈ మేరకు ప్రభుత్వాలూ చర్యలు తీసుకుంటాయి. కానీ చంద్రబాబు సర్కార్ నిరుపేద విద్యార్థులపై పగ బట్టారు. గురుకులాల్లో సీబీఎస్ఈలో చదువుకుంటున్న విద్యార్థులతో ఆడుకుంటున్నారు. ఉన్నట్టుండి సీబీఎస్ఈ సిలబస్ రద్దు చేస్తున్నామంటూ ప్రకటించి వారి భవితను ప్రశ్నార్థకం చేశారు.

గురుకులాల్లో సీబీఎస్ఈకి మంగళం

- విద్యాసంవత్సరం మూడు నెలలు గడిచాక నిర్ణయం
- చంద్రబాబు నిర్ణయాన్ని తప్పుపడుతున్న మేధావులు
- పదో తరగతిలో ఇష్టానుసారం మార్పులు తగవని హితవు

49 జిల్లాలో సీబీఎస్ఈ సిలబస్ అమలవుతున్న గురుకులాలు

2,920 మంది గురుకులాల్లో పదో తరగతి చదువుకుంటున్న విద్యార్థులు

పుట్టపర్తి: విద్యార్థులకు మనమిచ్చే ఆస్తి ఏదైనా ఉంది అంటే అది చదువు ఒక్కటే అని నమ్మిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. అమ్మఒడితో ప్రతి ఒక్కరూ చదువుకునేందుకు అవకాశం కల్పించారు. నాడు- నేడుతో బడుల రూపురేఖలు మార్చేశారు. ప్రభుత్వ బడుల్లోనూ ఇంగ్లిష్ మీడియం చదువులకు శ్రీకారం చుట్టారు. అలాగే సీబీఎస్ఈ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్)తో పిల్లలను జాతీయ స్థాయిలో రాణించేలా చర్యలు తీసుకున్నారు. కానీ రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన కూటమి సర్కార్ జగన్ పథకాలకు మంగళం పాడుతోంది. ఈ క్రమంలో నిరుపేదల విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడుకుంటోంది.

విద్యా సంవత్సరం మూడు నెలలు గడిచాక

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో గత ప్రభుత్వం నిర్ణయం మేరకు..జిల్లాలోని 49 గురుకుల పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం సీబీఎస్ఈ సిలబస్‌లో పాఠాలు ప్రారంభించారు. ఇప్పటికే విద్యార్థులు సీబీఎస్ఈ సిలబస్‌లోనే యూనిట్ టెస్టులు కూడా రాశారు. తాజాగా చంద్రబాబు ప్రభుత్వం సీబీఎస్ఈ సిలబస్ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీనిపై అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

"పేద పిల్లలకు ఉచితంగా చదువు చెప్పడం ప్రభుత్వ బాధ్యత కాదు. ప్రభుత్వ బడుల్లో సదుపాయాలు ఉండవు. ప్రైవేటు స్కూళ్లు బాగుంటాయి. డబ్బున్నవారు అక్కడ చదువుకుంటారు. మీరూ ఫీజులు కట్టి ప్రైవేటు స్కూళ్లకు వెళ్లండి'

సీఎం హోదాలో గతంలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలివి. దానికి తగ్గట్టుగానే ఇప్పుడూ వ్యవహరిస్తూ నిరుపేద కుటుంబాల్లోని విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు.

మదింపు పేరుతో ఉత్తుత్తి పరీక్ష

ఇటీవల పదోతరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని మదింపు చేస్తామంటూ కూటమి ప్రభుత్వం.. మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు 50 ఇచ్చి ట్యాబ్స్ ద్వారా పరీక్ష నిర్వహించింది. రాత పరీక్ష కాకుండా ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఆ ఫలితాలు ఏమిటన్నది ఎవరికీ తెలియదు. ప్రభుత్వం మాత్రం సీబీఎస్ఈ సిలబస్‌ను విద్యార్థులు అర్థం చేసుకోవడం లేదని ఆ సిలబస్‌నే రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో పదో తరగతి విద్యార్థులు కొత్తగా స్టేట్ సిలబస్‌లో పాఠాలు చదవాల్సిన పరిస్థితి నెలకొంది. సర్కార్ తాజా నిర్ణయాన్ని ఉపాధ్యాయులూ తప్పు పడుతున్నారు. విద్యా సంవత్సరం మూడు నెలలు గడిచాక మళ్లీ స్టేట్ సిలబస్‌లో కొత్తగా పాఠాలు చెప్పడం చాలా ఇబ్బంది అవుతుందని, సకాలంలో సిలబస్ పూర్తి కాకపోతే అది పదో తరగతి విద్యార్థులకు తీరని నష్టం చేకూరుస్తుందంటున్నారు. ప్రభుత్వం మాత్రం కేవలం వైఎస్ జగన్ ప్రవేశపెట్టారన్న ఏకైక కారణంగా సీబీఎస్ఈ రద్దుకే మొగ్గుచూపింది.

ప్రైవేట్ విద్యాసంస్థలకు మేలు

ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలకు లాభం చేకూర్చేందుకే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కార్ సెంట్రల్ సిలబస్‌ను రద్దు చేసిందని మేధావులు అభిప్రాయపడుతున్నారు. చంద్రబాబు ముందు నుంచి కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తున్నారని, ప్రభుత్వ బడుల్లో సీబీఎస్ఈని రద్దు చేసి మరోసారి తన నిజ స్వరూపాన్ని ప్రదర్శించారని వారు పేర్కొంటున్నారు.

ఐబీ, టోఫెల్‌ను అటకెక్కించిన కూటమి సర్కార్

సర్కారు బడుల్లో చదివే విద్యార్థుల్లో ఇంగ్లిష్ భాషా సామర్థ్యాలు పెంచి వారు ఉన్నత తరగతుల్లో రాణించేందుకు జగన్ సర్కార్ 'టోఫెల్'ను సిలబస్‌లో అంతర్భాగం చేసింది. అలాగే ఐబీ(ఇంటర్నేషనల్ బాకలారియట్)ను ప్రవేశపెట్టింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే టోఫెల్‌కు టాటా చెప్పేసింది. ఐబీని అటకెక్కించడం విశేషం.

నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలి



ఏ ప్రభుత్వమైనా విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించే దిశగా చర్యలు తీసుకోవాలి. అంతేగానీ విద్యార్థులకు మేలు చేసే వాటిని రద్దు చేయకూడదు. గత జగన్ సర్కార్ ప్రభుత్వ స్కూళ్లలో సీబీఎస్ఈ ప్రవేశపెట్టింది. దీనివల్ల విద్యార్థులకు మేలు జరుగుతుంది. దాన్ని రద్దు చేయటం తగదు. ఈ నిర్ణయంపై చంద్రబాబు సర్కార్ పునరాలోచించుకోవాలి.

– శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు, యూటీఎఫ్

మూడు నెలల తర్వాత నిర్ణయమా?



సిలబస్ మార్చాలంటే విద్యా సంవత్సరం ప్రారంభంలోనే నిర్ణయం తీసుకోవాలి. విద్యార్థులు మూడు నెలలు సీబీఎస్ఈ సిలబస్ చదివాక దాన్ని రద్దు చేయడం సరికాదు. దీనివల్ల పిల్లలు మళ్లీ స్టేట్ సిలబస్‌లో పాఠాలు చదువుకోవాల్సి ఉంటుంది. ఈ చర్యల వల్ల పదో తరగతి విద్యార్థుల తీవ్రంగా ఇబ్బంది పడతారు. సీబీఎస్ఈ సిలబస్ కోసమే చాలా మంది ప్రైవేటు స్కూళ్లకు వెళతారు. అలాంటిది సర్కార్ బడుల్లో ప్రవేశపెట్టిన సీబీఎస్ఈ సిలబస్‌ను రద్దు చేయడం సరైన నిర్ణయం కాదు.

– కత్తి నాగిరెడ్డి, విశ్రాంత ఎంఈఓ, పుట్టపర్తి

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం



ప్రభుత్వం సీబీఎస్ఈ రద్దు చేసిన విషయం వాస్తమే. జిల్లాలోని 49 గురుకులాల్లో 2,920 మంది విద్యార్థులు సీబీఎస్ఈలో పదో తరగతి చదువుకుంటున్నారు. ఇప్పుడు వారందరికీ ప్రత్యేక తరగతులు నిర్వహించి స్టేట్ సిలబస్ పాఠాలు చెబుతాం. పబ్లిక్ పరీక్షల నాటికి పూర్తిగా సన్నద్ధం చేస్తాం.

– మీనాక్షి, జిల్లా విద్యాశాఖ అధికారి

వ్యవసాయం లాభసాటిగా మారాలి

- 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాల్లో మంత్రి సవిత



పాపిరెడ్డిపల్లిలో పొలం పిలుస్తోంది పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత

పుట్టపర్తి అర్బన్/గోరంట్ల: వ్యవసాయం లాభసాటిగా మారాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. మంగళవారం ఆమె జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత గోరంట్ల మండల పరిధిలోని పాపిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం పాల్గొన్న ఆమె హిందూపురం ఎంపీ పార్థసారథితో కలిసి వ్యవసాయశాఖ రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం పుట్టపర్తి మండలం నిడిమామిడి గ్రామంలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరతో కలిసి మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా రైతు వెంకటరాముడు వరి పొలాన్ని వ్యవసాయాధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమవేశంలో మంత్రి ప్రసంగించారు. రాయితీతో అందిస్తున్న డ్రిప్పు, స్ప్రింక్లర్ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గోకులాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వ్యవసాయంలో రైతులకు మెలుకువలు నేర్పుతూ వ్యవసాయాన్ని పండుగలా చేయడానికి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం ఇచ్చే పంటలను సాగు చేయాలన్నారు. మంత్రి వెంట మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఆర్డీఓ భాగ్యరేఖ, తహసీల్దార్ అనుపమ, డివిజనల్ వ్యవసాయ అధికారి అల్తాఫ్ అలీఖాన్, ఏఓలు వెంకటబ్రహ్మం, మునికృష్ణ తదితరులు ఉన్నారు.

నిష్పక్షపాతంగా విచారణ చేయండి

- ధర్మవరం దాడి ఘటనపై ఎస్పీని కోరిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి
- పక్కా ప్రణాళికతోనే దాడి చేసినట్లు వెల్లడి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

పుట్టపర్తి టౌన్: ధర్మవరంలో సోమవారం జరిగిన ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఎస్పీ రత్నను కోరారు. మంగళవారం పుట్టపర్తికి విచ్చేసిన ఆయన.. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రత్నను కలిశారు. ధర్మవరం ఘటనను వివరించి పూర్తి స్థాయిలో విచారణ జరపాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన పోలీస్ కార్యాలయం ఎదుట విలేకరులతో మాట్లాడారు. ధర్మవరం నియోజకవర్గం వెంకటగారిపల్లిలో ఇటీవల టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి చేయగా, పోలీసులు మాత్రం వైఎస్సార్ సీపీ శ్రేణులపైనే కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారన్నారు. వారిని పరామర్శించేందుకు సోమవారం మధ్యాహ్నం తాను సబ్ జైలుకు వెళ్లానన్నారు. దాడికి పక్కా ప్రణాళికతో అప్పటికే అక్కడ కాపు కాసిన కూటమి నాయకులు సబ్‌జైలు వద్ద వీరంగం సృష్టించారన్నారు. ఆ సమయంలో తాను సబ్‌జైలులో కార్యకర్తలను పరామర్శిస్తున్నానన్నారు. కానీ పోలీసులు మాత్రం తనపై, తన అనుచరులపై అక్రమ కేసులు బనాయించారన్నారు. కూటమి నాయకులు ప్రణాళిక ప్రకారం రెచ్చగొట్టి దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఈ ఘటనపై నిష్పక్షపాతంగా పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ఎస్పీని కోరామన్నారు. గత 15 ఏళ్లుగా ధర్మవరం ప్రశాంతంగా ఉందని, అలాంటి నియోజకవర్గంలో ఇప్పుడు కూటమి నాయకులు దౌర్జన్యాలు, దాడుల సంస్కృతి తీసుకొచ్చారన్నారు. రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించడం సరికాదని హితవు పలికారు. ఇలాంటి ఘటనలు ముమ్ముందు ఎలాంటి పరిణామాలకైనా దారి తీయవచ్చన్నారు. పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ధర్మవరం ఘటనపై ఎస్పీ సానుకూలంగా స్పందించి పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని హామీ ఇచ్చారు.

ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి ఎంపిక షెడ్యూల్ ఖరారు

అనంతపురం: ఎస్‌జీఎఫ్ అండర్-19 ఉమ్మడి అనంతపురం జిల్లా స్థాయి ఎంపిక ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్ ఖరారు అయ్యింది. ఈ మేరకు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ జి.లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులు. 2006 జనవరి 1 తరువాత జన్మించిన వారై ఉండాలి. పుట్టిన సంవత్సరం నిర్ధారణకు పాఠశాలలో హెడ్‌మాస్టర్ సంతకం చేసిన స్టడీ సర్టిఫికెట్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ జతపరచాల్సి ఉంటుంది. జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులైతే పదో తరగతి మార్క్సుకార్డు జిరాక్స్ మీద ప్రిన్సిపాల్ సంతకం తప్పనిసరిగా చేయించాలి. క్రీడాకారులు తమ వెంట క్రీడా సామగ్రి తీసుకురావాల్సి ఉంటుంది.

ఎంపిక షెడ్యూల్ ఇలా...

ఆటపేరు	నిర్వహించే తేదీ	జరిగే ప్రదేశం
వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, రగ్బీ, రోల్ స్కేటింగ్	సెప్టెంబర్ 27	ప్రభుత్వ న్యూటౌన్ కళాశాల, అనంతపురం
బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్, చెస్, నెట్‌బాల్	సెప్టెంబర్ 28	ప్రభుత్వ జూనియర్ కళాశాల న్యూటౌన్, అనంతపురం
బాస్కెట్‌బాల్, కబడ్డీ, పటిల్, బ్యాడ్మింటన్, యోగా	సెప్టెంబర్ 30	ఇండోర్ స్టేడియం, అశోక్‌నగర్, అనంతపురం
అథ్లెటిక్స్, హాకీ, ఖోఖో	అక్టోబర్ 1	ఆర్ట్స్ కళాశాల, అనంతపురం

రైతు ఉసురు తీశారు!

- కలెక్టరేట్లో ఆత్మహత్యకు ప్రయత్నించిన రైతు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- రెవెన్యూ అధికారుల అలసత్వం, వైద్యుల నిర్లక్ష్యం వల్లే ప్రాణం పోయిందంటున్న కుటుంబ సభ్యులు
- ఘటనపై కలెక్టర్ విచారణ



మృతిచెందిన రైతు సూర్యనారాయణ



విలపిస్తున్న సూర్యనారాయణ భార్య ఈశ్వరమ్మ

అనంతపురం/మెడికల్/అర్బన్/గార్లదిన్నె/పామిడి: ఇటు రెవెన్యూ అధికారులు, అటు వైద్యులు కలసి ఓ రైతు ఉసురు తీశారు. సమస్యను పరిష్కరించకుండా నాన్చుతూ వచ్చిన రెవెన్యూ అధికారుల తీరుతో మనస్తాపానికి గురై రైతు పురుగు మందు సేవించగా..సకాలంలో సరైన చికిత్స చేయకుండా నిర్లక్ష్యం వహించి అతను ప్రాణాలు కోల్పోవడానికి వైద్యులు కారణమయ్యారు. అంతిమంగా ఆ రైతు కుటుంబానికి తీరని వేదన మిగిల్చారు. పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ పామిడి మండల కేంద్రంలోని బొడ్రాయి మెయిన్ బజార్‌కు చెందిన కుమ్మర సూర్యనారాయణ (50) అనే రైతు సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్‌లో పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన విషయం విదితమే. ఇతను అనంతపురం సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. కుమ్మర సూర్యనారాయణ గార్లదిన్నె మండలం బూదేడు గ్రామ సర్వే నంబరు 135-1లో 1.54 ఎకరాల భూమిని తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్నాడు. ఈ భూమికి పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులకు విన్నవించుకున్నాడు. నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి పురుగు మందు తాగాడు. పోలీసులు గమనించి స్థానిక సర్వజనాస్పత్రిలో చేర్పించారు. వైద్యులు సకాలంలో సరైన చికిత్స అందించలేదు. అక్యూట్ మెడికల్ కేర్ (ఏఎంసీ) యూనిట్‌లో ఉంచి అత్యవసర వైద్యం అందించాల్సి ఉండగా... సాధారణ పాయిజన్ కేసుగానే పరిగణించి, ఏఎంసీలో పడకలు ఖాళీ లేవన్న సాకుతో ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగంలోనే చికిత్స చేశారు. పరిస్థితి విషమించడంతో చివరకు మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటలకు ఏఎంసీ విభాగానికి మార్చారు. ఉదయం 8.30 గంటలకు అతను మృతి చెందాడు. మరోవైపు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు మాత్రం రైతు సూర్యనారాయణకు మెరుగైన వైద్య సేవలందించేలా చర్యలు తీసుకున్నట్లు చెబుతున్నారు. రైతు సూర్యనారాయణకు భార్య ఈశ్వరమ్మతో పాటు కుమారులు హేమంత్, నరేంద్ర ఉన్నారు. హేమంత్ చెన్నైలో క్యాటరింగ్ చేస్తూ జీవనం సాగిస్తుండగా.. బీటెక్ పూర్తిచేసిన నరేంద్ర అదే నగరంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు.

కుటుంబ సభ్యుల ఆందోళన

సూర్యనారాయణ మృతికి రెవెన్యూ అధికారులే కారణమంటూ కుటుంబ సభ్యులు సర్వజనాస్పత్రిలో ఆందోళన చేశారు. పట్టాదారు పాసు పుస్తకం సమస్యను పరిష్కరించాలని ఎన్నిమార్లు అధికారులను మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. అందువల్లే ఆత్మహత్య చేసుకున్నాడని కన్నీటి పర్యంతమయ్యారు. సోమవారం ఉదయమే కలెక్టరేట్‌లో పురుగు మందు తాగినా సాయంత్రం వరకు తమకు సమాచారం ఇవ్వలేదన్నారు. అలాగే సర్వజనాస్పత్రిలో సరైన చికిత్స అందించలేదని వాపోయారు.

బూదేడు వీఆర్వోపై ఫిర్యాదు

బూదేడు వీఆర్వో మధుబాబు నిర్లక్ష్యం వల్ల తన భర్త సూర్యనారాయణ మృతి చెందాడని భార్య ఈశ్వరమ్మ అనంతపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాసుపుస్తకం ఇవ్వడానికి రూ.13 వేలు లంచం వీఆర్వో అడిగారని, ఆ మొత్తం ఇవ్వడానికి నిరాకరించడంతోనే పాసు పుస్తకంలోకి భూమి వివరాలు ఎక్కించకుండా జాప్యం చేశారని ఆరోపించారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపారు.

కలెక్టర్ విచారణ

రైతు సూర్యనారాయణ ఆత్మహత్య ఘటనపై కలెక్టర్ వి.వినోద్‌కుమార్ విచారణ చేశారు. సంబంధిత తహసీల్దారు, రెవెన్యూ అధికారులను కలెక్టరేట్‌కు పిలిపించి రైతు సమస్య, ఇచ్చిన ఎండార్స్‌మెంట్ తదితర వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేయాలని జాయింట్ కలెక్టర్‌ను ఆదేశించామని కలెక్టర్ 'సాక్షి'కి తెలిపారు. జేసీ బుధవారం రైతు పొలాన్ని పరిశీలిస్తారన్నారు.

● వాహ్‌నరం



గొర్రెల మందలో ఉన్న వానరం, దాని పిల్ల

ఇక్కడ గొర్రెల మంద మధ్యలో ఉన్న వానరం చేసే పనులు చూసిన వారంతా 'వాహ్'నరం అంటున్నారు. సోమందేపల్లి మండలం ఈదులబళాపురం పంచాయతీ రేణుకానగర్‌కు చెందిన కిష్టప్ప గొర్రెల కాపరి. కొన్నేళ్ల క్రితం అతని వద్దకు ఓ చిన్న వానరం వచ్చింది. దాని ఆలనా పాలనా చూడటంతో అది అతని వద్దే ఉండిపోయింది. ప్రస్తుతం అతని గొర్రెలకు కాపరిగా మారిపోయింది. గొర్రెల వెంట వెళ్లడం, అవి పక్కకు వెళ్లకుండా, ఇతర గొర్రెలు కలిసిపోకుండా చూస్తోంది. గొర్రెలపైనే కూర్చుని వెళ్లడం చూసి స్థానికులు ఆశ్చర్యపోతున్నారు. గొర్రెలు సైతం వానరం అంటే ఎంతో మక్కువ చూపుతున్నాయి. ఇక రోజూ యజమాని కిష్టప్ప పెట్టే భోజనం తిని యజమాని కంటే ముందుగా గొర్రెల మంద వెంట వెళ్తోందీ వానరం. ప్రస్తుతం వానరానికి ఒక పిల్ల ఉన్నా... దాన్ని సైతం ఎత్తుకొని గొర్రెలకు కాపలాగా వెళ్తుండటం విశేషం.

– పెనుకొండ:



ఓ గొర్రెపై తలవాల్చిన వానరం

క్లుప్తంగా

కోన క్షేత్రం నుంచి గోపీచంద్ స్వామి బహిష్కరణ



తీర్మానం ప్రతిని గది తలుపులకు అతికించిన ఆలయ కమిటీ సభ్యులు

చెన్నేకొత్తపల్లి: ఉమ్మడి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా ఖ్యాతి గాంచిన కోన కణ్వా శ్రమం పవిత్రతకు భంగం కలిగించేలా ప్రవర్తించిన దత్తానందగిరి స్వామి అలియాస్ గోపీచంద్ స్వామిని క్షేత్రం నుంచి బహిష్కరిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గోపీచంద్ స్వామి తీరుపై మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు కణ్వాశ్రమంలో సమావేశమై చర్చించారు. అనంతరం ఆయనను క్షేత్రం నుంచి బహిష్కరించాలంటూ తీర్మానించారు. ఇందుకు సంబంధించిన ప్రతిని అందజేసేందుకు వెళితేగోపిచంద్ స్వామి అందుబాటులో లేకపోవడంతో ఆయన గది తలుపులకు అతికించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ... ఆధ్యాత్మిక కేంద్రం పరిసరాల్లో అసభ్య పదజాలంతో దూషణలకు పాల్పడడంతో పాటు మహిళా భక్తులతో అనుచితంగా ప్రవర్తించేవాడన్నారు. ఆదాయ వనరులను దోచుకోవడంతో పాటు ఆశ్రమ ప్రశాంతతకు భంగం కలిగించడంతో ఆయనను క్షేత్రం నుంచి బహిష్కరిస్తున్నట్లుగా ప్రకటించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



హిందూపురం అర్బన్: స్థానిక లక్ష్మీపురం సమీపంలోని బ్యాళ్ల ఫ్యాక్టరీ వెనుక మంగళవారం సాయంత్రం అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి(50)ని స్థానికులు గుర్తించి డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. మృతుడు ఎక్కువగా వాల్మీకి సర్కిల్, చిన్న మార్కెట్ ప్రాంతాల్లో భిక్షాటన చేసుకుంటూ ఉండేవాడని ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారణ అయింది. సంబంధీకులు ఎవరైనా ఉంటే స్పందించాలని హిందూపురం రెండో పట్టణ పోలీసులు కోరారు.

స్కిట్ నిలిచేనా?!

- మూతపడే స్థితిలో శ్రీకాళహస్తీశ్వర ఇంజినీరింగ్ కళాశాల
- జేఎన్‌టీయూ (ఏ) పరిధిలోకి తెచ్చేందుకు కసరత్తు
- సాధ్యాసాధ్యాల పరిశీలనకు కమిటీ నియామకం
- గతంలోనూ రెండు దఫాలు కమిటీలు వేసి సిఫారసుల బుట్టదాఖలు
- ఈసారైనా ఆచరణలోకి తెచ్చి కాలేజీని కాపాడాలంటున్న విద్యావేత్తలు



అనంతపురం: వేలాది మందికి ఉజ్వల భవిష్యత్తు ఇచ్చి.. మంచిపేరు ప్రఖ్యాతులు గాంచిన శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్కిట్) కాలగర్భంలోకి కలిసి పోకుండా కాపాడాలని విద్యావేత్తలు కోరుతున్నారు. శ్రీ కాళహస్తీశ్వర ఆలయానికి అనుబంధంగా 1997–98 విద్యా సంవత్సరంలో స్కిట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రారంభించారు. మొదట ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, కంప్యూటర్ సైన్సెస్ కోర్సులకు అనుమతించారు. ఒక్కొక్క కోర్సులో 60 సీట్లు కేటాయించారు. ఆ తర్వాత కొంతకాలానికి సివిల్ ఇంజినీరింగ్ కోర్సుకు కూడా అనుమతి ఇచ్చారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ కళాశాల నిర్వహించే విధంగా ప్రభుత్వం నిర్ణయించింది. ఆరంభంలో ఈ కళాశాల శ్రీకాళహస్తి కాసా గార్డెన్‌లో నడిపారు. ఆ తరువాత కొంతకాలానికి శ్రీరామ నగర్ కాలనీకి కొద్ది దూరంలో పూతలపట్టు– నాయుడు పేట ప్రధాన రహదారి పక్కనే 55 ఎకరాల విస్తీర్ణంలో సొంత భవనాలు నిర్మించారు.

రూ.750 కోట్ల ఆస్తులు

రాష్ట్రంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఏకైక ఇంజినీరింగ్ కళాశాల కావడం.. బోధన బాగా ఉండటం.. మంచి ఫలితాలు వస్తుండడంతో అనతి కాలంలోనే స్కిట్‌కు మంచి ఖ్యాతి వచ్చింది. ప్రధాన బ్రాంచ్‌ల్లో అదనపు సీట్లు పెంపుదల చేశారు. దీనికి తోడు డిప్లొమో కోర్సులు సైతం నిర్వహించారు. ఆదాయ పెంపుదల ప్రధానం కాకుండా గ్రామీణ విద్యార్థులకు సాంకేతిక విద్య అందించాలనే ప్రధాన ఆశయంతో ఈ కళాశాల అప్పట్లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ కళాశాల ఆస్తుల విలువ రూ.750 కోట్లు ఉంటాయని అంచనా వేశారు. విద్యార్థుల నుంచి వచ్చే ఫీజులతోనే కళాశాల ఉద్యోగులకు జీతాలు ఇచ్చే విధంగా నియమ నిబంధనలు రూపొందించారు. ముక్కంటి ఆలయం వారు తొలి కామన్ డిపాజిట్ కోసం రూ.50 లక్షలు ఇచ్చారు. ఆ తరువాత కళాశాల నుంచి వచ్చే ఆదాయమే జీతాలకు, అభివృద్ధి పనులకు సరిపోయేది. 1997 నుంచి 2013 వరకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా కళాశాల నిర్వహించారు.

2013 నుంచి తగ్గుముఖం

విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోవడం ప్రారంభమైంది. ఆలయ అధికారులు పట్టించుకోకపోవడం, కళాశాలలో వర్గ రాజకీయాలు అధికం కావడం, రాజకీయ జోక్యం మితిమీరడం వంటి కారణాలతో కళాశాల పతన దిశగా పయనించడం ప్రారంభం అయింది. విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. 2016 నవంబర్ నాటికి అక్కడ పనిచేసే ఉద్యోగులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ప్రతి నెలా రూ.25 లక్షల వంతున ముక్కంటి దేవాలయం వారు చెల్లిస్తున్నారు. కళాశాల ఉద్యోగుల వేతనాలకు ఇప్పటి దాకా దేవాలయం వారు రూ.14 కోట్లు చెల్లించారు. ఈ భారం అధికం కావడంతో రాష్ట్ర దేవదాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్థితిగతులను అధ్యయనం చేశారు. 2019–20 సంవత్సరంలో పూర్తిగా అడ్మిషన్లు లేవు. అంతకు ముందు సంవత్సరాల్లో చేరిన విద్యార్థులు బీటెక్‌లో 15 మంది, డిప్లొమోలో 12 మంది ఉన్నారు. చివరి సంవత్సరం విద్యార్థులు కోర్సులు ముగిసి బయటకు వెళ్లిపోతారని, కళాశాలను మూసివేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఈ కళాశాలలో 29 మంది బోధన, 36 మంది బోధనేతర ఉద్యోగులు ఉన్నారు.

ఇప్పటికే రెండు దఫాలు కమిటీ ఏర్పాటు

స్కిట్‌ను జేఎన్‌టీయూ (అనంతపురం) పరిధిలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే రెండు దఫాలు కమిటీలను నియామకం చేసి, సిఫారసులను బుట్టదాఖలు చేశారు. మరో దఫా కమిటీని నియమించారు. ఈసారైనా ఆచరణ సాధ్యమయ్యేనా? లేక మొక్కుబడిగా కమిటీ వేసి కాలయాపన చేస్తారా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. పూర్తిగా జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోకి తెచ్చి.. గతంలో మాదిరి విద్యార్థుల ఫీజులతోనే కళాశాలను నిర్వహించాలని, స్కిట్‌లో పనిచేసే ఫ్యాకల్టీని అక్కడికే పరిమితం చేసి జీతాలు చెల్లించాలని, ఉద్యోగులను వర్సిటీ పరిధిలోకి తెస్తే సాంకేతిక, న్యాయపరమైన చిక్కులు వస్తాయని నిపుణులు అంటున్నారు.

కళాశాలకు మంచి పేరు తీసుకురండి

- జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘునాథరెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈఓ రఘునాథ్‌రెడ్డి

హిందూపురం టౌన్: చదువులో ఉన్నతంగా రాణించి, జేఈఈ, నీట్, ఎంసెట్‌లలో మంచి ర్యాంకులు సాధించడం ద్వారా కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థినులకు జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘునాథరెడ్డి సూచించారు. హిందూపురంలోని చిన్నమార్కెట్ వద్ద ఉన్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, మన బడి నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులు పరిశీలించారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థినులతో సమావేశమై బోధనా తీరుపై ఆరా తీశారు. చదువులో రాణించి తల్లిదండ్రులకు, అధ్యాపకులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనురాధ, అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

కదిరి టౌన్: వ్యక్తిపై దాడి చేసిన కేసులో బాధితుడి భార్యతో పాటు మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను కదిరి సీఐ డీవీ నారాయణ రెడ్డి వెల్లడించారు. కదిరిలోని వేమారెడ్డి సర్కిల్‌లో పద్మజ, మధుసూదన్ దంపతులు సాయి మెడికల్ పేరుతో దుకాణం నిర్వహిస్తుండేవారు. చాలాకాలంగా ఇద్దరి మధ్య మనస్పర్థలున్నాయి. ఈ నెల 18న రాత్రి 10.30 గంటలకు వాణి స్ట్రీట్‌లో పద్మజతో పాటు ఆమెతో చనువుగా ఉంటున్న డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకుడు ఖాలేషా నడుచుకుంటూ వెళుతుండగా భర్త గమనించి నిలదీశాడు. ఆ సమయంలో వారిద్దరూ కలసి మధుసూదన్‌పై విచక్షణారహితంగా దాడి చేసి, గాయపరిచారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు... విచారణ అనంతరం పక్కా ఆధారాలతో పద్మజ, ఖాలేషాను అరెస్ట్ చేసి, మంగళవారం ఉదయం న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ప్రభుత్వ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

- ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖరరెడ్డి

హిందూపురం టౌన్: ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కూటమి ప్రభుత్వాన్ని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి డిమాండ్ చేశారు. హిందూపురంలోని ఓ ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌లో మంగళవారం ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ స్థాయి సర్వసభ్య సమావేశం జరిగింది. ఏఐఎస్‌ఎఫ్ ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ... హాస్టల్ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను తక్షణమే విడుదల చేయాలన్నారు. పాత భవనాల స్థానంలో కొత్తవి నిర్మించాలని సూచించారు. హిందూపురం పట్టణంలో బాలుర డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు పరచాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం హిందూపురం నియోజకవర్గ నూతన కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా దేవరాజ్, ఉపాధ్యక్షులుగా మహేష్, అమీన్, నూర్, వసంత్, ప్రధాన కార్యదర్శిగా నరసింహమూర్తి, సహాయ కార్యదర్శులుగా గోపి, అశోక్, వెంకటేష్, జావీద్, కోశాధికారిగా పవన్‌తో పాటు 21 మంది కార్యవర్గ సభ్యులు, 43 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టండి

- కలెక్టర్ టీఎస్ చేతన్



పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులతో చర్చిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: సీఎస్‌ఆర్ నిధులను వినియోగిస్తూ విరివిగా ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టాలని పరిశ్రమల నిర్వాహకులకు కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. సీఎస్‌ఆర్ నిధుల వినియోగంపై జిల్లాలోని వివిధ పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులతో మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ సమీక్షించారు. సీఎస్‌ఆర్ నిధుల వినియోగంపై ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. నిధుల వినియోగానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లాలో ఉన్న 35 పెద్ద తరహా పరిశ్రమలు ఉండగా ఇందులో 9 పరిశ్రమల యాజమాన్యాలు సీఎస్‌ఆర్ పనులు పూర్తి చేశాయన్నారు. సీఎస్‌ఆర్ నిధులను వినియోగించేటప్పుడు పాటించాల్సిన మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. పుట్టపర్తి, లేపాక్షి, హేమావతి, రత్నగిరి ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ మహబూబ్ బాషా, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కేశవులు, కియా, స్లాఫ్, బర్జర్ మోబీస్, సూర్యరోష్ని తదితర పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్ట్



జూదరులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ముదిగుబ్బ: మండలంలోని పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పి.కొట్టాల సమీపంలో మద్దిలేరు వాగు వద్ద కోడి పందెం ఆడుతున్న పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. అందిన సమాచారం మేరకు మంగళవారం ఉదయం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో కోడి పందెం ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.15,830 నగదు, రెండు పందెం కోళ్లు, ఆరు కత్తులు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్యామరావు, ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు.

హిందూపురం పురపాలక సంఘం "ఇ" ప్రొక్యూర్‌మెంట్

ప్రమాదంలో యువకుడి మృతి



మృతుడు రాజు

పావగడ: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... రొద్దం మండలం కోగిర గ్రామానికి చెందిన రాజు (25) మంగళవారం ద్విచక్ర వాహనంపై పావగడ నుంచి స్వగ్రామానికి వెళుతుండగా మార్గమధ్యంలో టీఎన్‌పేట వద్ద ఎదురుగా రొద్దం నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న మారుతీ ప్రసాద్ ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన రాజుతో పాటు మారుతీప్రసాద్‌ను స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో రాజు మృతి చెందాడు. మెరుగైన వైద్యం కోసం మారుతీప్రసాద్‌ను బెంగళూరుకు రెఫర్ చేశారు. కాగా, మృతుడు రాజుకు తల్లిదండ్రులు గవంగాధర్, లక్ష్మీదేవి ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సురేష్ తెలిపారు.

యువకుడి దుర్మరణం

గుమ్మఘట్ట: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన కుంటి పాలప్ప కుమార్తె లక్ష్మికి 16 సంవత్సరాల క్రితం 75 వీరాపురం గ్రామానికి చెందిన రమేష్‌తో వివాహమైంది. మంగళవారం ఆమెను కుక్క కరవడంతో విషయం తెలుసుకున్న తమ్ముడు నాగరాజు (38) ద్విచక్రవాహనంపై బాధితురాలిని ఎక్కించుకుని కళ్యాణదుర్గానికి పిలుచుకెళ్లి చికిత్స చేయించాడు. అనంతరం తిరుగు ప్రయాణమైన వీరు 75 వీరాపురం గ్రామ శివారులోకి చేరుకోగానే గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళుతుండగా మార్గంమధ్యలో నాగరాజు మృతి చెందాడు. పరిస్థితి విషమంగా ఉన్న లక్ష్మిని వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. కాగా, మృతుడికి భార్య లక్ష్మి, ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కసాపురం దేవస్థానం ఈఓగా వాణి



గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం ఈఓగా కె.వాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న భద్రాజీని అరసవెల్లి సూర్యనారాయణస్వామి ఆలయ ఈఓగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో కాణిపాకం ఈఓగా పనిచేస్తున్న వాణిని నియమితులు కావడంతో మంగళవారం ఉదయం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ మర్యాదలతో అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు.

9వ తరగతి విద్యార్థి అదృశ్యం



గోవర్ధనరెడ్డి

గుత్తి: స్థానిక నంబర్–1 ప్రభుత్వ వసతి గృహంలో ఉంటూ ఎంఎస్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వి.గోవర్ధనరెడ్డి కనిపించకుండా పోయాడు. ఐదు రోజుల క్రితం పాఠశాలకు వెళ్లిన గోవర్ధనరెడ్డి తిరిగి హాస్టల్‌కు చేరుకోలేదు. చీకటి పడుతున్నా విద్యార్థి హాస్టల్‌కు రాకపోవడంతో వార్డెన్ బాషా విషయాన్ని వెంటనే బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లిలో నివాసముంటున్న గోవర్ధనరెడ్డి తల్లి స్వప్నకు ఫోన్ చేసి తెలిపాడు. అయితే బాలుడు ఇంటికి కూడా చేరుకోలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ బాలుడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో మంగళవారం ఉదయం ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ ఇతరులతో కలసి హాస్టల్ వద్దకు తల్లి స్వప్న చేరుకుని ఆరా తీశారు. అయితే గోవర్ధనరెడ్డి కనిపించడం లేదని ఐదు రోజుల క్రితమే తాను సమాచారం ఇచ్చానని వార్డెన్ తెలపడంతో వాగ్వాదం జరిగింది. అనంతరం గోవర్ధనరెడ్డి కనిపించడం లేదంటూ తల్లితో పాటు వార్డెన్ కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

అనంతపురం: కలెక్టరేట్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న పడిగేరి శివకుమార్ కనిపించడం లేదు. ఈ మేరకు అనంతపురం రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. ఈ నెల 19న ఉదయం11 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన ఆయన తిరిగి చేరుకోలేదు. దీంతో ఆయన భార్య పి.నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పాత్రికేయుడిపై దాడి హేయం


- బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ డీఎస్పీకి ఫిర్యాదు



డీఎస్పీ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

ధర్మవరం: విధి నిర్వహణలో ఉన్న పాత్రికేయులపై దాడులు చేయడం హేయమైన చర్యగా ధర్మవరం ప్రెస్‌క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం సాక్షి టీవీ విలేకరి రమేష్‌పై బీజేపీ నాయకులు చేసిన దాడిని ఖండించారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్ నుంచి నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీగా డీఎస్పీ కార్యాలయానికి చేరుకుని దాడికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ డీఎస్పీ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడుతూ... ధర్మవరం చరిత్రలో ఇప్పటి వరకూ పాత్రికేయులపై దాడి జరిగిన దాఖలాలు లేవన్నారు. చాలీచాలని వేతనాలతో సమాజ సేవకు అంకితమైన పాత్రికేయులకు రక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు జానపాటి మోహన్, గౌరవాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి, ప్రధాన కార్యదర్శి కోసిన మురళీగౌడ్, కోశాధికారి పతకమూరి నాగభూషణ, సభ్యులు బావిశెట్టి, మజ్జిగ భాస్కర్, ప్రభ రమేష్, భీమనేని వెంకటేష్, పామాల నాగేంద్ర, శివానాయక్, రమేష్, శ్రీశైలం భాస్కర్‌గౌడ్, జ్వాలా ప్రసాదరెడ్డి, జయరామిరెడ్డి, అంజి, నారాయణస్వామి, గ్రంధి శ్రీనివాసులు, గోల్డ్‌ప్రసాద్, మూర్తి ప్రసాద్, ఆదినారాయణ, బాబయ్య, మంజు, మల్లికార్జున, శ్రీనాథ్‌గౌడ్, సంద్ర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండిళ్లలో చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

తాడిపత్రి రూరల్: మండలంలోని యుగుడూరులో రెండు ఇళ్లలో దుండగులు చొరబడి విలువైన వస్తువులను అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన సూర్యనారాయణ, నారాయణస్వామి... తమ ఇళ్లకు తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి హైదరాబాద్‌కు వెళ్లారు. విషయాన్ని గుర్తించిన దుండగులు ఇళ్లకు వేసిన తాళాలను సోమవారం రాత్రి బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించి నగలు, నగదు అపహరించుకెళ్లారు. మంగళవారం ఉదయం చుట్టుపక్కల వారు గమనించి సమాచారం ఇవ్వడంతో హైదరాబాద్‌లో ఉన్న బాధితులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ లోపు తాడిపత్రి అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాధితులు వచ్చి ఫిర్యాదు చేసిన తర్వాత ఎంత మేర సొత్తు పోయింది తెలుస్తుందని పోలీసులు పేర్కొన్నారు.

రథం ఘటనపై సమగ్ర విచారణ చేయాలి : సీపీఎం

అనంతపురం అర్బన్: కణేకల్లు మండలం హనకహల్ గ్రామ రామాలయం రథాన్ని దగ్ధం చేసిన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. షెడ్ తాళాలను సోమవారం అర్ధరాత్రి ధ్వంసం చేసి రథానికి నిప్పు పెట్టినట్లు గ్రామస్తులు తెలిపారన్నారు. దీనికి కారకులను త్వరగా గుర్తించడంతో పాటు ఘటనపై దుష్ప్రచారాలు చేసే వ్యక్తుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని అధికారులను కోరారు.

ఆపరేషన్ వికటించిందని బంధువుల ఆందోళన



ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

అనంతపురం: నగరంలోని రామచంద్రనగర్‌లో ఉన్న లావణ్య ఆస్పత్రి ఎదుట కూడేరు మండలం హంసాయవల్లి గ్రామస్తులు ఆందోళన చేశారు. ఈ నెల 9న గ్రామానికి చెందిన రాధమ్మకు లావణ్య ఆసుపత్రిలో ఓ వైద్యుడు శస్త్ర చికిత్స చేసి గర్భసంచి తొలగించాడు. అనంతరం అదే రోజు రాత్రి డిశ్చార్జ్ చేయడంతో ఆమెను కుటుంబసభ్యులు ఇంటికి పిలుచుకెళ్లారు. మరుసటి రోజు ఉదయం మూత్రం రాక తీవ్ర నొప్పితో బాధపడుతున్న రాధమ్మను అదే రోజు తిరిగి లావణ్య ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకువచ్చారు. ఆ సమయంలో వైద్యుల సూచన మేరకు సర్వజనాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో తమకు తెలిసిన వారి సాయంతో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి బాధితురాలిని చేర్చారు. వైద్య పరీక్షల అనంతరం గర్భసంచితో పాటు మూత్రనాళం, మూత్రపిండాలకు సంబంధించిన నాళాలను సైతం కత్తిరించినట్లుగా అక్కడి వైద్యులు నిర్ధారించారు. అంతేకాక శస్త్రచికిత్స చేసిన తర్వాత ఆరు నెలల వరకూ విశ్రాంతి అవసరమన్నారు. ఈ విషయం తెలుసుకున్న హంసాయవల్లి గ్రామస్తులు, బాధితురాలి కుటుంబసభ్యులు మంగళవారం రాత్రి లావణ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న మూడో పట్టణ సీఐ శాంతి లాల్ అక్కడకు చేరుకుని భరోసా నివ్వడంతో ఆందోళనను విరమించారు.

ఐదుగురిపై కేసు నమోదు

రొద్దం: వాటర్ ట్యాంక్‌ను ధ్వంసం చేసిన కేసులో ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలను హెడ్‌కానిస్టేబుల్ కాంతప్ప వెల్లడించారు. రొద్దంలో నివాసముంటున్న గొందిపల్లి నాగరాజు ఇంటిపై ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌ను నాగార్జున, చరణ్, శ్యామల, ప్రమీల, రామాంజినేయులు పైపులు, ఇనుపరాడ్‌తో ధ్వంసం చేశారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ అనంతరం ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జింకను తప్పించబోయి.. బైక్ పల్టీ

- ముగ్గురికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న సురేష్

లేపాక్షి: రోడ్డుకు అడ్డంగా వచ్చిన జింకను తప్పించబోయి బైక్ పల్టీ కొట్టిన ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. లేపాక్షి గ్రామానికి చెందిన సురేష్, భార్య నాగమణి, కుమారుడితో కలిసి మంగళవారం హిందూపురం సింగిరెడ్డిపల్లికి వచ్చాడు. రాత్రి వేళ తిరిగి స్వగ్రామం వెళ్తుండగా.. సుబ్బిరెడ్డిపల్లి వద్ద బైక్‌కు జింక అడ్డు వచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో సురేష్ బ్యాలెన్స్ తప్పడంతో బైక్ పల్టీ కొట్టింది.ఈ ఘటనలో సురేష్‌తో పాటు భార్య, కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వారిని అంబులెన్స్‌లో హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

రైతు ఆత్మహత్య

డి.హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలం మడేనహళ్లికి చెందిన రైతు లింగన్న (35) ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యవసాయం నష్టాలను ఎదుర్కొన్న ఆయన తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. దీంతో భార్య విడిపోయి కర్ణాటకలోని రాజాపూర్‌లో పుట్టింటికి చేరుకుని వేరు కాపురం పెట్టింది. ముగ్గురు పిల్లల్లో చిన్న కుమార్తె నానమ్మ మారెక్క వద్ద, మిగిలిన ఇద్దరు తల్లి వద్దనే ఉంటున్నారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి పెంచుకున్న లింగన్న... మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.